# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన – 1** **08, నవంబర్, 2014**

తెలంగాణలో వేలాది చెరువులు తవ్వి ఈ ప్రాంతాన్ని సుభిక్షం చేసిన కాకతీయులకు ఎప్పుడూ రుణపడి ఉండాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. కాకతీయులను స్మరించుకోవడం, వారి స్ఫూర్తిని ప్రదర్శించడాన్ని తెలంగాణ ప్రభుత్వం బాధ్యతగా భావిస్తున్నదని ప్రకటించారు. అందుకే చెరువుల పునరుద్ధరణ కార్యక్రమానికి 'మిషన్ కాకతీయ' అనే పేరును ముఖ్యమంత్రి ఖరారు చేశారు. తెలంగాణలోని 45 వేల చెరువులను పునరుద్ధరించడానికి చేపట్టిన చెరువుల పునరుద్దరణ కార్యక్రమాన్ని యుద్ద ప్రాతిపదికన చేపట్టాలని, కాకతీయులు ఏ లక్ష్యాలతో చెరువులను తవ్వించారో ఆ లక్ష్యాలు సాధించడానికి ప్రతీ పౌరుడు పాటు పడాలని ముఖ్యమంత్రి చెప్పారు. మిషన్ కాకతీయ అనే టైటిల్ తో పాటు, మన ఊరు-మన చెరువు అనే క్యాప్షన్ కూడా పెడతారు. ఇదే పేరుతో ఐదేళ్ల పాటు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం చేపడతారు.

చెరువుల పునరుద్దరణ కార్యక్రమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ప్రభుత్వ సలహాదారుడు విద్యాసాగర్ రావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి ఎస్.కె. జోషి, జెన్ కో సిఎండి ప్రభాకర్ రావు, ఇ ఎన్ సి మురళీధర్, శివశంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని డిసెంబర్ మూడో వారంలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మే చివరి నాటికి మొదటిదశ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు వెంటనే చెల్లించాలని, నిధుల కొరత లేదని చెప్పారు. ఆన్ లైన్ లో చెల్లింపులు జరపాలన్నారు. ఈ ఏడాది పనులు పూర్తి చేస్తూనే, వచ్చే ఏడాది పునరుద్దరించాల్సిన చెరువులను గుర్తించి, ప్రతిపాదనలు సిద్దం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

కాకతీయులు ఎంతో దూరదృష్టితో చెరువులను తవ్వించారని, ఆ చెరువులు గతంలో గంగాళాలుగా ఉండేవని, సీమాంధ్రుల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చెరువులు ఇప్పుడు తాంబాళాలుగా తయారయ్యారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని చెరువులన్నింటిలో జలకల ఉట్టిపడాలని, ఎండాకాలంలో చేపలు పట్టుకోవాలని, వానా కాలంలో అలుగుపోయాలని, చలికాలంలో చెరువు నిండుగా కనిపించాలని, రజకులు బట్టలుతుకుకోవాలని, భూగర్భ జలాల మట్టం పెరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. చెరువు బాగుంటే ఊరంతా బాగుంటుందని, గ్రామాల్లో వివిధ రకాల కుల వృత్తులకు కూడా చెరువుల పునరుద్ధరణ దోహదపడుతుందని చెప్పారు. గ్రామాల్లో ఎక్కువ మంది వ్యవసాయం మీద ఆధారపడ్డవారే ఉంటారని, మిగతా కులాలకు కూడా చెరువులే ఆదెరువుగా ఉంటాయన్నారు. అమ్మ లాంటి చెరువులను కాపాడుకోవడం బిడ్డలుగా ప్రతీ ఒక్కరి బాధ్యత అని చెప్పారు. చెరువు మట్టితో భూసారం కూడా పెరుగుతుంది కాబట్టి, పూడిక మట్టిని పొలాలకు మళ్లించాలని చెప్పారు. కట్టుకాలువలు, పంటకాలువలు కూడా బాగు చేసుకోవాలని చెప్పారు. చెరువులు కేవలం మనుషులకే కాకుండా పశుపక్షాదులకు కూడా తాగునీరిచ్చి సేద తీరుస్తుందని, సమస్త ప్రాణకోటికి చెరువులే ప్రాణాధారమని ముఖ్యమంత్రి వెల్లడించారు. చెరువులను రక్షించుకోవడానికి చెరువులపై ఆధారపడే అన్ని కులాల ప్రాతినిధ్యంతో గ్రామ సర్వవర్గ సమితిని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. చెరువుల పునరుద్ధరణ కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా సాగవద్దని, అదో ప్రజా ఉద్యమంలా సాగాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రాధాన్యత అందరికీ చెప్పేందుకు తాను, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు కూడా శ్రమదానం చేస్తామని, ఊరు ఊరంతా కలిసి చెరువుల పునరుద్ధరణను ఓ పండుగలా నిర్వహించుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. చెరువుల పునరుద్దరణ కోసం చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా ఇంత ఖర్చు చేయలేదని, ఎవరూ శ్రద్ధ చూపలేదని ముఖ్యమంత్రి అన్నారు. కాకతీయుల కాలం నుంచి నిజాముల కాలం వరకు చెరువుల పరిస్థితి బాగానే ఉన్నా సీమాంధ్రుల పాలనలోనే ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యానికి, కుట్రపూరిత వివక్షకు గురయ్యాయన్నారు. గోదావరి, కృష్ణా జలాలను ఒడిలో నింపుకునేలా చెరువులు తయారు కావాలని ఆకాంక్షించారు.

పాలమూరు ఎత్తిపోతల పథకంపై సమీక్ష

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చే పాలమూరు ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే కొంత వరకు జరిగిన సర్వే వివరాలను తెప్పించుకుని పరిశీలించారు. కృష్ణా నది నుంచి ఎన్ని క్యూసెక్కుల నీరు తీసుకోవాలి? అందుకు ఉపయోగించే పైపులు ఎలా ఉండాలి? సాగునీటి అవసరాలతో పాటు జలవిద్యుత్ కోసం కూడా ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి? ఇందుకు అవసరమయ్యే కరెంటును ఎక్కడి నుంచి ఎంత అందించాలి? తదితర విషయాలపై సమీక్షించారు. సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని హైదరాబాద్ కు మంచినీరు అందించడంతో పాటు, కరువు పీడిత జిల్లాలకు సాగునీరు అందించాల్సి ఉందని, ఈ రెండు లక్ష్యాలు పాలమూరు ద్వారా నెరవేరతాయని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలోని ఎత్తిపోతల పథకాలకు అవసరమయ్యే విద్యుత్ ను ముందే కేటాయించుకోవాలని, అనిశ్చితిలో ఉండే జలవిద్యుత్ పై ఆధారపడకుండానే వాటికి విద్యుత్ కేటాయింపు జరగాలని చెప్పారు.